ఉగాది వేడుక.. ఉత్సాహ గీతిక

ఘనంగా శ్రీ క్రోధి నామ సంవత్సరాదికి ఆహ్వానం

కోడూరు: తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగను ప్రజలు ఇంటింటా ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. వేకువజామునే తమ ఇష్టదైవానికి పూజలు చేసి, షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఉగాది వేడుకలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గర్భాలయాన్ని మామిడికాయ గుత్తులతో అలంకరించి, మూలమూర్తులను విశేష అలంకారంలో తీర్చిదిద్దారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు పంచాంగ శ్రవణం చేయగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షించారు. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో 11 అడుగుల శ్రీమన్నారాయణుడికి ముత్యాలతో పొదిగిన వస్త్రాన్ని అలంకరించారు. హంసలదీవి వేణుగోపాలుడి ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు.

ఉగాది పరమార్థాన్ని అర్థం చేసుకోవాలి

నాగాయలంక: మండలంలోని పలు దేవాలయాల్లో ఉగాది వేడుకలు మంగళవారం శాస్త్రోక్తంగా సంప్రదాయరీతిలో ఘనంగా జరిగాయి. భావదేవరపల్లి అన్నపూర్ణ దేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకలో ముఖ్యఅతిథిగా పెదకళ్లేపల్లి ఓంకార పీఠాధిపతి విజయానంద గిరి స్వామి పాల్గొని ప్రసంగించారు. మానవాళి జీవితంలో షడ్రుచుల సమ్మేళన పరమార్థాన్నే ఉగాది పచ్చడి రూపంలో జీవన సత్యాన్ని చాటుతుందని స్వామీజీ చెప్పారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు, గ్రామస్తులు స్వామీజీని సత్కరించారు. అవనిగడ్డకు చెందిన బ్రహ్మశ్రీ ఆకెళ్ల దేవనాథన్ శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మాజీ ఎంపీటీసీ బొండాడ గణపతిరావు, మెండు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గణపేశ్వరం దుర్గమ్మ ఆలయంలో జరిగిన ఉగాది వేడుకలో ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణ దంపతులను ధర్మకర్త మండల రాంబాబు, అరుణ కుమారి దంపతులు సన్మానించారు. నాగాయలంక కన్యకా పరమేశ్వరి ఆలయం, ప్రసన్న గణపతి దేవస్థానంలో ఉగాది ప్రత్యేక పూజలు జరిపారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, కన్యకాంబ ఆలయ చైర్మన్ చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెడన: పెడన గౌడ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బస్టాండు సమీపంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించింది. తీర్థప్రసాదాలను పంపిణీ చేసింది. అధ్యక్షుడు పడమట బలరాం, ఉపాధ్యక్షులు నారగాని నంద, మరీదు వీరబాబు, కార్యదర్శిగా చిల్లిముంత చిరంజీవిలతో పాటు మరో పది మంది సభ్యులు ఈ పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ బుధవారం స్వామి వారి ఆలయంలోని హుండీ లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం ఆలయం వద్ద నారగాని వంశీయులు నంద, నాగరాజు, వంశీ తదితరులు భక్తులకు, పాదచారులకు, ప్రయాణికులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు.


అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న నూతన గౌడ సంఘ కమిటీ

ఘనంగా ఉగాది వేడుకలు

కృత్తివెన్ను: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రజలంతా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు జరిపి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని అంతా రుచిచూశారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు.

భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న పలు దేవాలయాల్లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు సంవత్సరమైన క్రోధి నామ సంవత్సరం సందర్భంగా మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణాన్ని భక్తులు శ్రద్ధగా విన్నారు. గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో ఐలూరి విశ్వనాథ దీక్షితులతో పంచాంగ శ్రవణం వినిపించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తొలుత స్వామి వారిని దర్శించుకుని పంచాంగాన్ని ఆలకించారు. శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో తనికెళ్ల వెంకట శివరామకృష్ణ భక్తులకు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.

కార్తికేయుని సన్నిధిలో పంచాంగ శ్రవణం

మోపిదేవి: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం ఆస్థాన వేద పండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఆదేశాల ప్రకారం 65 ఏళ్లు పైబడిన అర్చక స్వాములకు ఉగాది కానుకగా రూ. 10,116 ఘంటసాల మండలం శ్రీకాకుళంలో వేంచేసియున్న శ్రీకాకుళేశ్వర స్వామివారి దేవస్థానంలో అర్చకులుగా పనిచేస్తున్న అగ్నిహోత్రం భాస్కరాచార్యులకు అందజేశారు. అనంతరం దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలోనూ పంచాంగ శ్రవణం నిర్వహించారు.

శివతత్వంతో క్రోధం లేని క్రోధి నామ సంవత్సరం

ఘంటసాల: క్రోధం లేకుండా శివతత్వంతో మధ్యరక వర్ష, పాడిపంటలతో శ్రీ క్రోధినామ సంవత్సరం ప్రజలను రంజింపజేస్తుందని సుముహూర్త జ్యోతిష్య పరిశీలకులు పిశుపాటి వెంకట నరసింహారావు అన్నారు. ఘంటసాల గ్రామంలోని వడ్లమూడి - బండి వారి కోదండ రామాలయం, శ్రీభావనారుషి స్వామి వారి దేవస్థానాల్లో ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం ఆయన పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం బండి-వడ్లమూడి రామాలయం ప్రతినిధులు బండి పరాత్పరరావు, వడ్లమూడి బుజ్జి మాస్టారు పిశుపాటి వెంకట నరసింహారావును దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.


బందరులోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పంచాంగ శ్రవణం చేస్తున్న మాదవశర్మ

ఘనంగా ఉగాది వేడుకలు

గూడూరు: శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరాది వేడుకలు మంగళవారం గూడూరు మండలంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణాలు

బంటుమిల్లి: స్థానికంగా కొలువై ఉన్న గంగాపార్వతీ సమేత చంద్రమౌళేశ్వరస్వామి, సీతారామాంజనేయస్వామి దేవాలయాల్లో ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణాలు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవేదగాయిత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శివాలయంలో గూటాల పుల్లయ్యశాస్త్రి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రామాలయంలో సత్యనారాయణాచార్యులు పంచాగ విశేషాలను భక్తులకు వివరించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్కాప్రగడ శశికుమార్, అంబడిపూడి కాశీవిశ్వనాథం, మాజీ అధ్యక్షుడు మారుతికుమార్, చినతుమ్మిడి సర్పంచు ఓవైవీ చలం, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సిటీజన్లు చిట్టా వెంకటరత్నం (తాళపత్రులు), కొండూరు వెంకటశాస్త్రి దంపతులను నూతన వస్త్రాలతో సత్కరించారు.


ప్రత్యేక అలంకారంలో కోడూరు కల్యాణ వేంకటేశ్వరుడు


భావదేవరపల్లి ఆలయంలో స్వామీజీని సత్కరిస్తున్న ధర్మకర్త నిరంజనరావు దంపతులు


ఘంటసాల రామాలయంలో పిశుపాటి వెంకట నరసింహారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు


మోపిదేవి సుబ్బారాయుడి ఆలయంలో నిర్వహిస్తున్న పంచాంగ శ్రవణం


పెడన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఐలూరి దీక్షితులు పంచాంగ శ్రవణం

నగరంలో ఘనంగా ఉగాది

మచిలీపట్నంటౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను నగర ప్రజలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. స్థానిక శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పొక్కునూరి మాదవశర్మ పంచాంగ శ్రవణం చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో నగరంలోని చిలకలపూడిలో వేంచేసియున్న శ్రీ విజయ సీతారామ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ముదిగొండ వీరభద్రశాస్త్రి పంచాంగ పఠనం చేశారు.

క్లుప్తంగా

సుబ్బారాయుడి సన్నిధిలో ఎమ్మెల్యే సింహాద్రి



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయన తొలుత నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

వాలీబాల్ క్రీడాకారుడి కుటుంబానికి పరామర్శ



ఘంటసాల: ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు ఆకస్మిక మరణం బాధాకరమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. ఘంటసాల అంబేడ్కర్ నగర్‌కు చెందిన వాలీబాల్ ప్లేయర్ గుర్రం ఆనందరావు సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మంగళవారం ఘంటసాల విచ్చేసి ఆనంద్ భార్య రామలక్ష్మి, కుమారుడు సోమన్ కార్తీక్‌లను పరామర్శించారు. అనంతరం ఆనందరావు చిత్రపటానికి విక్టర్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ చైతన్య వేదిక కన్వీనర్ దాసి సీతారామరాజు, దరిశి శ్రీరామ్, గొరుముచ్చు శ్రీనివాసరావు, పాపారావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దీవించమ్మా.. గంగానమ్మా




కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగా భవానీ అమ్మవారి ప్రధాన గుడి సంబరం మంగళవారం ప్రారంభమైయింది. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తొలిరోజు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. కోడూరు, ఐబీపేట, యర్రారెడ్డివారిపాలెం, కృష్ణాపురం, నాయుడుపేట గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి, పశుసంపదను కాపాడాలంటూ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. ఆలయంలో పోతురాజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చిన్నఅమ్మవారి గ్రామోత్సవం ప్రస్తుతం కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లో కొనసాగుతోంది. ప్రతి ఇంటి వద్ద మహిళలు అమ్మవారి వాహనం ముందు నీటిని ఓరబోసి భక్తిభావం చాటుతున్నారు. బుధవారం అమ్మవారిని త్రిశులధారణిగా అలంకరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ధర్మకర్త యుగంధరరావు తెలిపారు. ఉదయం అమ్మవారి నైవేధ్యాల సమర్పణ, రాత్రి ప్రధాన గుడిజాతర నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాస శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేర్ని కిట్టును గెలిపించండి



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కు రానున్న ఎన్నికల్లో అఖండ విజయం చేకూర్చాలని కోరుతూ నగరంలోని 50వ డివిజన్‌లో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు మరీదు నాగరాజు, కేశన నాని ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పేర్ని కిట్టును గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి పేర్ని కిట్టు, పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు.

ప్రజలతో మమేకం



అవనిగడ్డ: స్థానిక శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు పలువురికి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అవనిగడ్డలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానికులతో కలసి టీ తాగారు. పలువురిని ఆయన అప్యాయంగా పలుకరించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పలువురు సామాన్యులతో కలసి కరచాలనం చేసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మళ్లీ అధికారం ఇవ్వడం ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తారన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న పేర్ని కిట్టు


సహపంక్తిగా కూర్చొని ఇఫ్తార్ చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఇనుగుదురుపేట జామియా మసీదులో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. రంజాన్ ఉపవాసదీక్షను విరమించిన అనంతరం ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు పేర్ని కిట్టు హాజరయ్యారు. ముస్లింలతో కలిసి సహపంక్తిగా కూర్చుని విందును స్వీకరించారు. తొలుత మసీదుకు వచ్చిన ముస్లింలతో ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, డైరెక్టర్ మొహిసిన్, వైఎస్సార్ సీపీ నాయకులు మొహమ్మద్‌సాహెబ్, బాషు, నజాఫ్ అలీ, అన్వర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంగీత సభలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: శ్రీ త్యాగరాజ సంగీత విద్యా పీఠం స్వర్ణోత్సవ సంగీత సభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బుట్టాయిపేటలోని చిట్టిపిళ్లారయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ సభలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మంగళవారం సాయంత్రం జరిగిన సంగీతసభలో విద్యా పీఠం అధ్యక్షుడు బీహెచ్‌ఈఎల్ రాధాకృష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేశారు. వాగ్గేయకార సంకీర్తన - బృందగానం లో లింగరాజు విజయలక్ష్మి, సింగరాజు కల్యాణి, కాశీపట్నపు ఉమా ఆలపించిన గానాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. అలాగే గూడూరు ద్రోణేంద్ర ఫణికుమార్ వేణుగానం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై బీరక సురేష్, మోర్సింగ్ పై టి. లక్ష్మీశంకర్ వాయిద్య సహకారం అందించారు. బుధ, గురువారాల్లో కూడా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామని సంగీత ప్రియులు విచ్చేయాలని విద్యాపీఠం సహాయ కార్యదర్శి జొన్నలగడ్డ లక్ష్మీకాంత్ కోరారు.

చలివేంద్రం ప్రారంభం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్. సూర్య చక్రధరరావు మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. దేవస్థానం తరపున భక్తుల సౌకర్యార్థం ఆలయం ఎదుట చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

చెరువులకు జల కళ


తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులోకి మోటార్ల సాయంతో నీరు తోడుతున్న దృశ్యం

- తాగునీటి కొరతకు చెక్
- ఈస్ట్ రైవస్ కాలువకు నీరు
- ముమ్మరంగా తరకటూరు చెరువు నింపే పనులు
- గుడ్‌వాటర్ చానల్ నీరు పుట్లమ్మచెరువుకు సరఫరా

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రజలకు ఈ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఉన్న తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలు తగ్గుముఖం పడటంతో ఇటీవల కొద్ది రోజులుగా రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారు. తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పూర్తి సామర్థ్యం 5.19 మీటర్లు కాగా ఇది 2.38కు చేరింది. సోమవారం రాత్రికి ట్యాంకు సమీపంలో ఉన్న ఈస్ట్ రైవస్ కాలువకు నీరు రావటంతో మునిసిపల్ ఇంజినీర్ సాంబశివరావు, ఏఈ సాయిప్రసాద్ పర్యవేక్షణలో చెరువు నింపే పనులు చేపట్టారు. కాలువలో నీరు చెరువు పక్కన ఉన్న సంపులోకి చేరటంతో ఈ నీటిని మోటార్లు, ఆయిల్ ఇంజిన్ల ద్వారా తోడి చెరువు నింపుతున్నారు. వారం రోజుల పాటు కాలువల ద్వారా నీటి సరఫరా ఉంటుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఈ నీటితో చెరువును పూర్తిస్థాయి నింపేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు.


సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ప్రస్తుత పరిస్థితి

11 నుంచి రోజు విడిచి రోజు సరఫరా..



ఈ నెల 11వ తేదీ నుంచి నగరం ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా చేస్తాం. చెరువుల్లో నీటి నిల్వలు తగ్గటంతో కొద్ది రోజులుగా రెండు రోజులకు ఒకసారి తాగునీరు అందించాం. కాలువలకు నీరు రావటంతో చెరువులు నింపుతున్నాం. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, పుట్లమ్మచెరువులను పూర్తిస్థాయిలో నింపి నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు అందిస్తాం.

– సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర్

ముమ్మరంగా తరకటూరు చెరువు నింపే పనులు..

మంగళవారం రాత్రి నుంచి స్టోరేజ్ ట్యాంకు నింపే పనులు ప్రారంభించారు. 2.38 మీటర్ల మేర నీటితో ఉన్న ట్యాంకు మంగళవారానికి దాదాపు 3 మీటర్ల మేర నీరు చేరింది. ప్రస్తుతం 655 హెచ్‌పీ ఎలక్ట్రికల్ మోటార్లతో, 800 హెచ్‌పీ ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడి చెరువు నింపుతున్నారు. మరో 600 హెచ్‌పీ ఆయిల్ ఇంజిన్లను నీటిని తోడేందుకు సిద్ధం చేస్తున్నారు.

పుట్లమ్మచెరువు కూడా..

ఆకుమర్రు లాకు వద్ద ఉన్న గుడ్‌వాటర్ చానల్‌కు నీటిని విడుదల చేశారు. ఈ నీటితో నగరంలోని పుట్లమ్మచెరువులను నింపే పనులను ప్రారంభించారు. సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుతో పాటు పుట్లమ్మచెరువులు నిండిన అనంతరం నగరప్రజలకు ఈ వేసవిలో సైతం తాగునీరు పుష్కలంగా అందనుంది.

చెరువు నింపే పనుల పరిశీలన


తరకటూరు చెరువును పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నియోజకవర్గ ప్రజలకు తాగునీటిని అందించే తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నింపే పనులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం పరిశీలించారు. సోమవారం రాత్రి నుంచి ట్యాంకును నింపే పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ నాయకుల బృందం చెరువు వద్ద జరుగుతున్న నింపే పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రభుత్వం పులిచింతల నుంచి నీటిని విడుదల చేయటంతో బందరు, ఈస్ట్ రైవస్ కాలువకు నీటిని విడుదల చేశారన్నారు. ఈ నీటిని చెరువులు నింపేందుకు వినియోగిస్తున్నారన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, కాగిత జవహర్‌లాల్, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీఏఎస్ మూర్తి, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కాలువల్లో తాగునీరు.. అధికారుల పర్యవేక్షణ


బంటుమిల్లి మల్లేశ్వరం స్కీం వద్ద నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రవికుమార్

బంటుమిల్లి: బంటుమిల్లి ప్రధాన కాలువకు తాగునీరు విడుదలైన సందర్భంగా నీరు దుర్వినియోగం కాకుండ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం తహసీల్దార్ వై. రవికుమార్, డీటీ శివకుమార్‌లు కలసి రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి నీరు దారిమళ్లకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. కాలువకు 100 నుంచి 150 క్యుసెక్కుల నీరు విడుదల అయిన క్రమంలో అధికారులు ఆయా గ్రామాల పంచాయతీ అధికారులతో ముందుగా చర్చలు జరిపి ఏర్పాట్లు చేయించారు. దీని కోసం పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు బృందంగా ఏర్పడి ప్రధాన కాలువ కట్టపై బ్రాంచి కెనాల్ వద్ద పెద్ద ఎత్తున ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి నీరు తరలిస్తున్నారు. కాలువ నీరు బంటుమిల్లి బంగ్లా వద్దకు చేరుకున్న క్రమంలో నీటిపారుదల శాఖ ఎస్‌ఈ టీజే ప్రసాదుబాబు, డీఈ గణపతిరావు, ఆడబ్బ్యు ఎస్ డీఈ నటరాజు, ఏఈలు వి. నాగేశ్వరరావు, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

అభ్యర్థులకు 'హంసలదీవి' సెంటిమెంట్


హంసలదీవి వేణుగోపాలుడు

కోడూరు: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు 'హంసలదీవి' సెంటిమెంట్‌గా మారింది. అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు ఈ హంసలదీవి నుంచే తమ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న సింహాద్రి రమేష్‌బాబు ఇప్పటికే ఈ ఏడాది మార్చి 13వ తేదీన తన ఎన్నికల ప్రచారాన్ని కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసి హంసలదీవి నుంచి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ సైతం హంసలదీవి గ్రామాన్ని సందర్శించి అక్కడ ఉన్న వేణుగోపాల స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి సైతం తన ఎన్నికల ప్రచారాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. అవనిగడ్డ నియోజకవర్గానికి తూర్పువైపు ఉన్న ప్రాంతం హంసలదీవి కావడంతో ఇక్కడ నుంచి ప్రచారం మొదలు పెడితే గెలుపు వరిస్తుందని నేతల విశ్వాసం.

శంభో ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఘంటసాల(కొడాలి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసిన శంభో ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి ప్రధాన సెంటర్లో శంభో క్షేత్రం మహిళా యోగ సాధకుల ఆధ్వర్యంలో జననీ జాగృతి సేవోత్సవం మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయగా, మంగళవారం చౌదరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదాచారులకు, ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు మజ్జిగ పంపిణీ కేంద్రం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 10వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎం. భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఈడేపల్లి బస్టాండ్ ఏరియా, రుస్తుంబాద, చెమ్మనగిరి పేట, రాజాగారిసెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.